సాక్షి
రంగారెడ్డి
మంగళవారం । 30 । జూలై । 2024



పట్టుకోండి చూద్దాం!
మొయినాబాద్‌లో చోరీలు పెరుగుతున్నాయి. ఇళ్లు, షాపులు, ఆలయాలు టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోతున్నారు. 10లో▸



సత్తాచాటాలి
స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ అన్నారు. 10లో▸



డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి
డ్రగ్స్‌తో జీవితాలు నాశనం అవుతున్నాయని పంజాబ్‌కు చెందిన మహమ్మద్ ఉస్మాన్ లుధియాని ఆవేదన వ్యక్తం చేశారు. 10లో▸

న్యూస్‌రీల్

మతతత్వ శక్తులతో అప్రమత్తంగా ఉండాలి

సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సోమయ్య

నందిగామ: దేశంలో మతతత్వ శక్తులు అభివృద్ధికి అడ్డంకిగా మారాయని, వాటితో అప్రమత్తంగా ఉంటూ తరిమికొట్టాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య పిలుపునిచ్చారు. మండల పరిధిలోని ఈదులపల్లిలోని ఓ గార్డెన్‌లో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్యనాయకులకు జిల్లా శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి సామెల్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో సోమయ్య మాట్లాడుతూ.. దేశంలో మతతత్వ రాజకీయాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయని, వాటితో దేశం అనేక రకాలుగా వెనుకబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతతత్వ రాజకీయాలను తరిమికొట్టేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, నాయకులు రాజు, జగదీష్, యాదయ్య, శోభన్, కవిత, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రీనునాయక్, ఈశ్వర్, కుర్మయ్య, వెంకటరమణ, లక్ష్మి, శంకర్, రాజు, జగన్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మెహిదీపట్నం నుంచి కందవాడకు సిటీబస్సులు



సాక్షి, సిటీబ్యూరో: మెహిదీపట్నం నుంచి కందవాడకు బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ మేరకు మెహిదీపట్నం-కందవాడ (592) రూట్‌లో మూడు ట్రిప్పులు ప్రతిరోజు రాకపోకలు సాగించనున్నాయి. ఈ బస్సులు నానల్‌నగర్, లంగర్‌హౌస్, టీకే బ్రిడ్జి, బండ్లగూడ, ఆరెమైసమ్మ, తెలంగాణ పోలీస్ అకాడమీ జంక్షన్, గోల్డెన్‌ఫామ్స్, మల్కాపురం, పుల్లుట్ల, కేసారం, చేవెళ్ల మీదుగా కందవాడకు రాకపోకలు సాగిస్తాయి. మెహిదీపట్నం నుంచి ఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1.30, సాయంత్రం 3.55 గంటలకు బయలుదేరుతాయి. అలాగే కందవాడ నుంచి ఉదయం 9.25 గంటలకు, మధ్యాహ్నం 2.45, సాయంత్రం 5.10 గంటలకు తిరిగి మెహిదీపట్నంకు బయలుదేరుతాయి.

గ్రామీణ స్టార్టప్‌లకు ప్రభుత్వ ప్రోత్సాహం

మంత్రి శ్రీధర్‌బాబు

లక్డీకాపూల్: పర్యావరణ వ్యవస్థను మరింత బలోపేతం చేసే గ్రామీణ స్టార్టప్‌లకు ప్రభుత్వం ప్రోత్సాహం ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు తెలిపారు. సోమవారం బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణా హోటల్‌లో శేషాద్రి వంగల గ్రూప్, అవుట్‌లుక్ మీడియా ఆధ్వర్యంలో స్పాట్‌లైట్ ఇండోగ్లోబల్ బిజినెస్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ..స్టార్టప్ సంస్థలను అన్ని విధాల ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ..అంకుర్ బస్ యాత్ర వంటి వినూత్నమైన మార్గాలతో పర్యావరణ వ్యవస్థను నిర్మించే గ్రామీణ స్టార్టప్‌లను ప్రధానంగా ప్రోత్సహించే ఏఐ శ్రేష్టత, స్కిల్లింగ్‌పై రాష్ట్ర లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేస్తామని మంత్రికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్టార్టప్ ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ప్రతినిధి జేపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా అడుగులు

నెట్ జీరో సిటీ నిర్మాణానికి కసరత్తు

- మీర్‌ఖాన్‌పేట పరిధిలో స్కిల్ డెవలెప్‌మెంట్ వర్సిటీ
- తాజాగా భూములను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ వరకు రహదారి నిర్మాణానికి ఆదేశాలు
- వేగంగా ప్రారంభమైన పనులు



మీర్‌ఖాన్‌పేట ఫార్మాసిటీ రహదారి నుంచి ప్రతిపాదిత స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ భూమి మధ్య రోడ్డు నిర్మాణానికి జేసీబీల సాయంతో కొనసాగుతున్న పనులు

కందుకూరు: ఫార్మాసిటీ నిర్మాణానికి గత ప్రభుత్వం సేకరించిన భూముల్లో తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నెట్ జీరో సిటీ నిర్మాణానికి వేగంగా అడుగులు వేయడం ప్రారంభించింది. హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న భూముల్లో ఫార్మా కంపెనీలు ఏర్పాటు చేసి కాలుష్యకారకంగా మార్చొద్దని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టింది. అందులో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం ఇక్కడికి వచ్చి భూములను పరిశీలించారు.

రహదారి నిర్మాణ పనులు షురూ..

కందుకూరు, యాచారం, కడ్తాల్ మండలాల పరిధిలో గత ప్రభుత్వం ఫార్మాసిటీ ఏర్పాటు కోసం 19 వేల ఎకరాలను సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించింది. దాదాపు 12 వేల ఎకరాల వరకు సేకరించి టీజీఐఐసీకి అప్పగించింది. అందులో పట్టా, అసైన్డ్ భూములు ఉన్నాయి. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ పరిధిలో సేకరించిన భూముల్లో 40 ఎకరాల విస్తీర్ణంలో ఇప్పటికే అమెజాన్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేశారు. తాజాగా దానికి సమీపంలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చేలా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి సర్వే నంబర్ 112లో 57 ఎకరాలు కేటాయించారు. ఏడాదికి సుమారు 20 వేల మంది వరకు ఆ యూనివర్సిటీలో శిక్షణ ఇవ్వాలన్న లక్ష్యంతో దాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం రాత్రి ఆ భూములను సీఎం స్వయంగా పరిశీలించారు. ముందుగా మీర్‌ఖాన్‌పేట నుంచి కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ వరకు 200 అడుగుల విస్తీర్ణంలో రహదారి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆ రహదారి వెంబడే మెట్రో రైలు సైతం నిర్మించేలా ఉండాలని సూచించారు. కాగా సోమవారం ఫార్మా రహదారి నుంచి స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మాణం చేపట్టే భూములకు నేరుగా చేరుకునేలా రహదారి నిర్మించే పనులను జేసీబీ యంత్రాలతో చేపట్టారు. స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ నిర్మించే రహదారిని కొంగరకలాన్ ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ వరకు నిర్మించనున్నారు.

మరోవైపు భూములు కోల్పోయిన రైతులకు కేటాయించాల్సిన ప్లాట్లకు సంబంధించి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మీర్‌ఖాన్‌పేట సర్వే నంబర్ 120, పంజుగూడ సర్వే నంబర్ 90లో హెచ్‌ఎండీఏ నిర్మిస్తున్న లేఅవుట్‌లో పనులు కొనసాగుతున్నాయి.



రైతులకు కేటాయించే లేఅవుట్‌లో కొనసాగుతున్న పనులు

బాధితులకు చకచకా లేఅవుట్

ప్రస్తుతం లేఅవుట్‌లో రహదారులను అభివృద్ధి చేసే పనులు చేపట్టారు. దీంతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణానికి ఈ ప్రాంతంలోనే 25 ఎకరాలు కేటాయించనున్నారు. ఆగస్టు 1వ తేదీ ఆయా నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. దీంతో ఈ ప్రాంతం రూపురేఖలు త్వరలో పూర్తిగా మారనున్నాయి. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి వెళ్లడంతో రియల్ వ్యాపారుల్లో ఆశలు చిగురించాయి.

హలో సిటీ.. చలో ఢిల్లీ

సిటీ నుంచి అత్యధిక రాకపోకలు ఢిల్లీకే..

- ఆ తర్వాత స్థానంలో ముంబై, బెంగళూరు
- వేగంగా పెరుగుతున్న ప్రయాణికుల సంఖ్య
- దేశంలోనే 4వ స్థానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్ట్

సాక్షి, సిటీబ్యూరో: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల సంఖ్య శరవేగంగా పెరుగుతోంది. ప్రస్తుతం ప్రయాణికుల సంఖ్యా పరంగా దేశంలోనే 4వ స్థానంలో ఉన్న ఈ ఎయిర్‌పోర్ట్ త్వరలోనే తన స్థానాన్ని మరింత మెరుగుపరచుకోనుంది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) విడుదల చేసిన తాజా గణాంకాలు ఈ విషయాన్ని స్పష్టం చేశాయి. ఈ ఏడాది తొలి అర్ధభాగం వరకూ చూస్తే నగరం నుంచి ఢిల్లీకి అత్యధికంగా 14.6 శాతం మంది, ముంబైకి 10.8 శాతం మంది, బెంగళూరుకు 10 శాతం మంది రాకపోకలు సాగించినట్టు వెల్లడించింది.

ఢిల్లీకే ఎక్కువ..

నగరం నుంచి ఇతర నగరాలకు రాకపోకలు సాగించిన ప్రయాణికుల సంఖ్య లక్షల్లో ఉండగా అందులో తొలిస్థానం ఢిల్లీకి దక్కింది. ఈ ఏడాది తొలి అర్ధభాగంలో ఢిల్లీకి 16,14,660 మంది, ముంబైకి 11,97,952 మంది, బెంగళూరుకు 11,11,649 మంది రాకపోకలు సాగించారు.

మనకి నాలుగో స్థానం..

మొత్తంగా చూస్తే హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ 1,10,61,929 మంది ప్రయాణికులతో దేశంలోనే అత్యధిక సంఖ్యలో రాకపోకలు సాగించిన ఎయిర్‌పోర్ట్స్‌లో ఢిల్లీ, ముంబై, బెంగళూరు తర్వాత 4వ స్థానం దక్కించుకుంది. అయితే 10.9 శాతం పెరుగుదలతో శరవేగంగా బిజీగా మారుతున్న ఎయిర్‌పోర్ట్స్‌లో నగరం ఒకటిగా నిలుస్తోంది.

ట్రాఫిక్ హీట్ పుట్టించిన మే..

ఈ ఏడాది తొలి అర్ధభాగం అత్యధిక ట్రాఫిక్‌ను హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ చవిచూసింది. అందులోనూ గత మే నెలలో ప్రయాణికుల రద్దీ అత్యధికంగా కనిపించింది. సంఖ్యాపరంగా చూస్తే జనవరిలో 1.802 మిలియన్, ఫిబ్రవరిలో 1.730 మిలియన్, మార్చిలో 1.861 మిలియన్, ఏప్రిల్‌లో 1.858 మిలియన్, మేలో 1.971 మిలియన్, జూన్‌లో 1.841 మిలియన్ల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారు.





సమావేశంలో మాట్లాడుతున్న బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

ఐకమత్యంతోనే అభ్యున్నతి

- ముదిరాజుల సంక్షేమానికి అధిక నిధులు తెచ్చేందుకు కృషి
- ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

మొయినాబాద్ రూరల్: ముదిరాజ్‌ల అభ్యున్నతి కోసం ఐకమత్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర ముదిరాజ్ కో ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లోని పీవీ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం ముదిరాజ్‌ల ఐక్యత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టేందుకు కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనకు కల్పించిన అవకాశాన్ని జాతి అభ్యున్నతి కోసం వినియోగిస్తానని స్పష్టం చేశారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ఎంతకష్టమైనా పిల్లలను ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. ముదిరాజ్ సంఘానికి నార్సింగి ప్రాంతంలో ప్రభుత్వం ఇచ్చిన ఐదెకరాల స్థలంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు.

బీసీ ఏలోకి మార్చేలా పోరాడాలి..

మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరిముదిరాజ్, కాంగ్రెస్ నేత నీలం మధుముదిరాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ముదిరాజ్ జనాభా 55 లక్షల మంది ఉన్నారన్నారు. బీసీ డీ నుంచి ఏ గ్రూప్‌నకు మార్చేందుకు ఐకమత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం ముదిరాజులను కేవలం ఓటు బ్యాంకుగానే వాడుకుందని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ప్రభుత్వం తరఫున ముదిరాజ్‌లకు ప్రాధాన్యం పెరిగిందన్నారు. రాష్ట్రంలో మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ముదిరాజ్ కుటుంబాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. ముదిరాజ్ కోఆపరేటివ్ సొసైటీకి సీఎం రేవంత్‌రెడ్డి రూ.50 కోట్ల నిధులు కేటాయించారన్నారు. కానీ ఇవి సరిపోవని, కనీసం వెయ్యి కోట్లయినా కేటాయించాలని కోరుతామని స్పష్టంచేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు 15 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకునేందుకు అందరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా ముదిరాజ్‌ల ఐక్యత సమావేశం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేష్‌ముదిరాజ్, వైద్య నిపుణులు డాక్టర్ ప్రతిభ లక్ష్మి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి జగన్‌మోహన్ ముదిరాజ్, షాద్‌నగర్ నాయకుడు అందె బాబాయ్య, జిల్లా అధ్యక్షుడు గుడాల మల్లేశ్, జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ నారాయణపురం మహేందర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సేకరణ ఘనం.. అభివృద్ధి శూన్యం

- ఫార్మాసిటీకి యాచారం మండలం నుంచి వేల ఎకరాలు
- అసైన్డ్ భూముల మధ్యన పట్టా భూములతో పేచీ
- కోర్టు కేసులతో ముందుకు పడని అడుగు
- పరిశ్రమలు లేవు, రోడ్డు మార్గం నత్తనడకనే..
- చిక్కుముళ్లతో వీడని గ్రహణం



యాచారం: ఫార్మాసిటీ కోసం అత్యధిక భూసేకరణ జరిగినప్పటికీ అభివృద్ధిలో మాత్రం ఆశించిన స్థాయి పురోగతి కనిపించడం లేదు. బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, కల్వకుర్తి నియోజకవర్గాల నుంచి ఫార్మాసిటీకి 19,333 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించడానికి నిర్ణయించారు. ఇందులో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని యాచారం మండలం నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాడిపర్తి గ్రామాల్లోనే 10 వేల ఎకరాలకు పైగా అసైన్డ్, పట్టా భూములు ఉన్నాయి. అప్పట్లో రైతు ల నుంచి బలవతంగా భూసేకరణ చేశారు. అసైన్డ్ భూములకు ఎకరాకు రూ.8 లక్షలు, ప్రభుత్వ భూముల్లో కబ్జాలో ఉన్న రైతులకు రూ.7.70 లక్షలు, పట్టా భూములకు రూ.12.50 లక్షల నుంచి రూ.16 లక్షల వరకు పరిహారం చెల్లించారు. టార్గెట్ పూర్తి చేయడం కోసం అధికారులు రైతుల వెంటపడి అసైన్డ్, పట్టా భూములు సేకరించారు. అత్యధిక భూసేకరణ యాచారం మండలం నుంచి జరిగినప్పటికీ అభివృద్ధి పరంగా మాత్రం గ్రహణం పట్టింది. ఆయా గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టకపోగా, మీరాఖాన్‌పేట గ్రామం నుంచి యాచారం మండల కేంద్రం వరకు నిర్మాణం చేపట్టాల్సిన వంద అడుగుల రోడ్డు విస్తరణ కూడా నిలిచిపోయింది.

ఆది నుంచి అవాంతరాలే..


యాచారం మండలంలోని నాలుగు గ్రామాల్లో ఫార్మాసిటీకి సేకరించాల్సిన 9,851 ఎకరాలకు గాను ఇప్పటి వరకు 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూమిని సేకరించారు. తాడిపర్తి, నానక్‌నగర్, కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి గ్రామాల్లో 2,211 ఎకరాలకు సంబంధించి రైతులు తమ పట్టా భూములు ఇవ్వమని కోర్టును ఆశ్రయించగా వారికి కోర్టు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఆయా గ్రామాల్లోని అసైన్డ్ భూములు సేకరించిన మధ్యలోనే పట్టా భూములు ఉండడం.. పట్టా రైతులు కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకోవడంతో ప్రస్తుతం అధికారులకు పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి అవకాశం లేకుండా పోతోంది. తాడిపర్తి గ్రామంలోని 118, 113, 114, 115, 116, 117 సర్వేనంబర్లలో 3,635 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించినప్పటికీ.. అసైన్డ్ భూముల మధ్యన ఉన్న పట్టా రైతులు తమ భూములు ఇవ్వమని కోర్టుకెళ్లారు. కుర్మిద్ద గ్రామంలోని 311, 92, 26,164 సర్వే నంబర్లలో 1,582 ఎకరాల అసైన్డ్ భూమిని సేకరించగా ఈ భూముల మధ్యలో పట్టా భూములు ఉన్నాయి. నక్కర్తమేడిపల్లి గ్రామంలోని 118, 131,213,184, 247 సర్వే నంబర్లలో 2,104 ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు సేకరించగా ఆ భూముల మధ్యలో పట్టా భూము లున్నాయి. వాటి ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు అధికారులకు తెగేసి చెబుతున్నారు. కొద్ది రోజులు క్రితం కుర్మిద్ద గ్రామంలోని సర్వే నంబర్ 92లో పర్యటించిన కలెక్టర్ శశాంకకు కూడా ఇదే విషయం తేల్చి చెప్పారు. ఇలా చిక్కుముళ్లు అభివృద్ధికి ఆటంకంగా మారాయి.

రైతుల పేర్లు నమోదు చేయాలి




పట్టా రైతులకు సమాచారం లేకుండా 2,500 ఎకరాలకు పైగా అవార్డు పాస్ చేసి పరిహారం డబ్బులను అధికారులు అథారిటీలో జమ చేశారు. రైతుల పేర్లను తొలగించి రెవెన్యూ రికార్డుల్లో టీఎస్ఐఐసీ పేరు మార్చేశారు. మళ్లీ రైతుల పేర్లు నమోదు చేయాలని ఏళ్లుగా విజ్ఞప్తి చేస్తున్నా అధికారుల్లో చలనం లేదు. రికార్డుల్లో రైతుల పేర్లు నమోదు చేయండి.
– బందె రాజశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, కుర్మిద్ద

చిక్కుముళ్లతోనే జాప్యం



అప్పట్లో బీఆర్‌ఎస్ సర్కార్ చేసిన బలవంత భూసేకరణతో పట్టా రైతులు కోర్టులకు వెళ్లారు. కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. రైతుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. చిక్కుముళ్లు విప్పి అభివృద్ధి వేగవంతం అయ్యేలా, వంద అడుగుల రోడ్డు నిర్మాణం కూడా పూర్తయ్యేలా కృషి చేస్తాం.
– ముదిరెడ్డి కోదండరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

ఎట్టకేలకు కదలిక!



గ్రేటర్ సీఆర్‌ఓ పరిధిలో పట్టణ సర్కిళ్లు?

- 14 అర్బన్ సర్కిళ్లతో ప్రతిపాదనలు
- ఒకే గొడుగు కిందకు ప్రజా పంపిణీ వ్యవస్థ

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ పరిధిలోని పౌరసరఫరాల పట్టణ సర్కిళ్లను హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ అధికారి పరిధిలోకి తీసుకొనివచ్చే ప్రతిపాదనలకు కదలిక వచ్చినట్లు తెలుస్తోంది. ఇప్పటికే హైదరాబాద్ మహా నగరంలో శివారు ప్రాంతాలను సైతం విలీనం చేసే ప్రయత్నం సాగుతుండటంతో ప్రజాపంపిణీ వ్యవస్థను సైతం అదే తరహాలో ఒకే గొడుగు కిందికి తీసుకొచ్చే ప్రయత్నాలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. తాజాగా జీహెచ్‌ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లోని అర్బన్ 14 సర్కిళ్లతో ప్రతిపాదనలు సిద్ధమైనట్లు సమాచారం. సరిగ్గా పన్నెండేళ్ల క్రితం ప్రజాపంపిణీ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కేవలం 12 అర్బన్ సర్కిళ్లను సీఆర్వో పరిధిలోకి తీసుకొచ్చే ప్రతిపాదనలు రూపొందించారు. వీటిని హైదరాబాద్ సీఆర్వో ఆఫీస్ నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనరేట్‌కు పంపించారు. అక్కడి నుంచి ప్రభుత్వానికి కూడా ప్రతిపాదనలు సమర్పించారు. కాగా.. సంబంధిత ఉన్నత అధికారి బదిలీ కావడంతో ప్రతిపాదనల వ్యవహారం అటకెక్కింది.

సరికొత్త ప్రతిపాదనలతో..

జీహెచ్‌ఎంసీ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పరిధిలో 14 అర్బన్ సర్కిళ్లు ఉన్నాయి. హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ వ్యవస్థ మాత్రం తొమ్మిది అర్బన్ సర్కిళ్లతో పని చేస్తుండగా, మరో ఐదు సర్కిళ్లు నగర శివారు ప్రాంతంలో విస్తరించి ఉన్నాయి. ఇవి పూర్తిగా రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల పౌరసరఫరాల అధికారుల పర్యవేక్షణలో పని చేస్తున్నాయి. హైదరాబాద్ సీఆర్వో పరిధిలోకి మిగతా ఐదు అర్బన్ సర్కిళ్లను కూడా తీసుకొస్తే బాగుంటుందని పౌరసరఫరాల శాఖ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తం మీద జీహెచ్‌ఎంసీ పరిధిలో అర్బన్ సర్కిళ్లలో కలిపి సుమారు 12.55 లక్షల రేషన్ కార్డులు ఉండగా, అందులో 43.97 లక్షల యూనిట్లు ఉన్నాయి.

గుట్టుగా గుట్టకు బ్లాస్టింగ్స్

- కొంగరకుర్దులో అర్ధరాత్రి అడ్డగోలు పనులు
- ఎగిరిపడుతున్న రాళ్లు
- మృత్యువాతపడుతున్న పశువులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: రియల్టర్ల దెబ్బకు కళ్లముందే గుట్టలు కరిగిపోతున్నాయి. ప్రభుత్వ శాఖల నుంచి కనీస అనుమతి కూడా తీసుకోకుండా రాత్రిపగలు తేడా లేకుండా ఇష్టం వచ్చినట్లు బ్లాస్టింగ్స్ నిర్వహిస్తున్నారు. ఇటు పర్యావరణానికి అటు పశుపక్ష్యాదుల ఉనికిని దెబ్బతీస్తున్నారు. మహేశ్వరం మండలం కొంగరకుర్దు సర్వే నంబర్ 303లోని ఆరు ఎకరాల పట్టా భూమిలో విల్లా ప్రాజెక్ట్ చేస్తున్నారు. దీనికి ఆనుకుని దేవాదాయశాఖ భూమి కూడా ఉంది. ఇటు పట్టాభూమికి, అటు దేవాదాయశాఖ భూమికి మధ్యలో భారీ గుట్ట ఉంది. రియల్టర్లు దీన్ని తొలగించేందుకు కొంతకాలంగా బ్లాస్టింగ్ పనులు చేస్తున్నారు. ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో రాత్రి పగలు తేడా లేకుండా భారీగా జిలెటిన్‌స్టిక్స్‌ను పోగు చేసి బ్లాస్టింగ్స్ పనులు చేపడుతున్నారు. మైనింగ్‌శాఖ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు. ఈ భారీ పేలుళ్ల ధాటికి పక్కనే ఉన్న వ్యవసాయ బోరుబావులకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. మోటార్లు బోరుల్లో ఇరుక్కుపోతున్నాయి. పేలుడు ధాటికి రాళ్లు బలంగా దూసుకొచ్చి సమీపపాకలోని పశువులకు తగిలి, మృత్యువాతపడుతున్నాయి. ఓ గేదె కూడా మృతి చెందడంతో స్థానికులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో మైనింగ్ ఏఈ సహా ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, బ్లాస్టింగ్స్ వర్క్‌ను నిలిపివేయించారు. ఈ క్రమంలో పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ అధికారులెవరికీ అనుమానం రాకుండా అర్ధరాత్రి బ్లాస్టింగ్ పనులు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి, నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లకు పాల్పడుతున్న వ్యక్తులపై కేసులు నమోదు చేయాల్సిన ఎస్‌ఓటీ పోలీసులు అటు వైపు కన్నెత్తికూడా చూడక పోవడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

సర్పంచ్ ఎన్నికల్లో సత్తాచాటాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్

- పార్టీ బలోపేతానికి కృషి చేయాలి
- కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో సత్తాచాటాలని పార్టీ మహేశ్వరం నియోజవకర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో కొత్త, పాత తేడా లేకుండా 31 గ్రామ పంచాయతీల్లో మూడు రంగుల జెండా ఎగురవేయాలన్నారు. ప్రతీ గ్రామంలో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలనని సూచించారు. పార్టీ కోసం కష్టపడేవారికి భవిష్యత్‌లో తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు చేసిన రుణమాఫీ గురించి ప్రతీ కార్యకర్త లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. ఏ ఆపద వచ్చినా ప్రతీ నాయకుడు, కార్యకర్తకు ఎల్లవేళలా అండగా ఉంటానని పార్టీ కేడర్‌కు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో . ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త నజీర్, మాజీ ఎంపీపీ కొరుపోలు రఘుమారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఈశ్వర్ నాయక్, మాజీ మండల అధ్యక్షుడు కాకి ఈశ్వర్, ఆవుల యాదయ్య, కావలి దశరథ, సీనియర్ నాయకులు ఇజ్రాయేల్, రఘుపతి, మల్లేష్ యాదవ్, కూన యాదయ్య, రాఘుందర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, రాజు నాయక్, అంగోత్ కృష్ణ నాయక్, ప్రశాంత్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ప్రవీణ్, మురళీధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాజు, బాల్‌రాజ్, హరికిషన్ గౌడ్, యాదయ్య, వెంకట్‌రెడ్డి, లాజర్, కుమార్, పాండు నాయక్, విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనితారెడ్డి అసంతృప్తి

పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో కేఎల్లార్ తీరుపై మాజీ జెడ్పీచైర్‌పర్సన్ అనితా రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం పార్టీ పదవులు ఆశిస్తున్న వారితో మాట్లాడించి.. అనితారెడ్డికి అవకాశం ఇవ్వకుండా కేఎల్లార్ ప్రసంగించి సమావేశాన్ని ముగించారు. తాను మహేశ్వరం జెడ్పీటీసీ గెలిచి జెడ్పీ చైర్‌పర్సన్ అయ్యానని తనను అవమానించడం తగదని ఆమె ‘సాక్షి’తో ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ సంబురాల్లోనూ తానొక్కడే మాట్లాడి కార్యక్రమాన్ని ముగించారని ఇది సరికాదన్నారు. అందరినీ సమన్వయం చేసుకుంటేనే పార్టీ బలోపేతమవుతుందని ఆమె స్పష్టం చేశారు. మరోమారు ఇలాంటి తప్పిదాలు జరగకుండా చూడాలని సూచించారు.

మతిస్థిమితం లేని వృద్ధుడి అదృశ్యం



నాగేశ్వర్‌రావు (ఫైల్)

చేవెళ్ల: ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు కనిపించకుండా పోయాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామరగిద్ద గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా నిడుమూరు మండలం దేవరగోపవరం గ్రామానికి చెందిన తోక వెంకటమాణిక్యరావు తన కుటుంబంతో వలస వచ్చి దామరగిద్ద సమీపంలో ఓ ఫాంహౌస్‌లో కూలీ పని చేస్తున్నాడు. ఆయన తండ్రి తోక నాగేశ్వర్‌రావు(75)కు ఆరోగ్యం బాగాలేకపోవటంతోపాటు మానసిక పరిస్థితి సక్రమంగా లేదు. ఆదివారం పనులు చేసుకుని మధ్యాహ్నం ఇంటికి వచ్చిన వెంకటమాణిక్యరావు తండ్రి లేకపోవటంతో కంగారు పడ్డాడు. చుట్టుపక్కల వెతకగా, ఆచూకీ లభించకపోవడంతో సోమవారం చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు చేవెళ్ల పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు.

కర్ణాటక నుంచి వచ్చిన యువతి..



చంద్రమ్మ(ఫైల్)

అత్తాపూర్: ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ యువతి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్ఐ మల్కపురం నందగోపాల్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. శివరాంపల్లి వీకర్ సెక్షన్ కాలనీలో నివాసముంటున్న జ్యోతి సర్దార్ వల్లభాయ్ పటేల్ పోలీస్ అకాడమీలో హౌస్ కీపింగ్ పనులు చేసుకుంటూ శివరాంపల్లిలో నివాసం ఏర్పరుచుకుంది. ఈమె కూతురు చంద్రమ్మ కర్ణాటక రాష్ట్రంలో హాస్టల్లో ఉంటూ చదువుకుంటుంది. సెలవులు ఉన్నాయంటూ శివరాంపల్లికి వచ్చిన చంద్రమ్మ ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. తన ఇంటి సమీపంలో ఉన్న కాళిదాసును తాను ప్రేమిస్తున్నట్లు తల్లి జ్యోతికి చెప్పినట్లు ఫిర్యాదులో పేర్కొంది. కాళిదాసు పైనే అనుమానం వ్యక్తం చేసినట్లు ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుకోండి చూద్దాం!

మండల పరిధిలో దొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. పట్ట పగలే ఇళ్లు గుల్ల చేస్తున్నారు. నగలు, నగదు మాయం చేస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. సీసీ కెమెరాలను సైతం లెక్క చేయకుండా ముఖాలు మాస్కులేసుకుని తమ కానిచ్చేస్తున్నారు.

రెచ్చిపోతున్న దొంగలు

- మొయినాబాద్‌లో పెరుగుతున్న చోరీలు
- జంకుతున్న జనం
- పోలీసుల వైఫల్యమేనని ప్రజల ఆరోపణ

మొయినాబాద్: మొయినాబాద్‌లో చోరీలు పెరుగుతున్నాయి. ఇళ్లు, షాపులు, ఆలయాలు టార్గెట్‌గా దొంగలు రెచ్చిపోతున్నారు. సీసీ కెమెరాలు ఉన్నా... ముఖం కనిపించకుండా జాగ్రత్త పడుతూ దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఆరు నెలలుగా వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు. పోలీసుల నిఘా వైఫల్యంతోనే దొంగలు రెచ్చిపోతున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.

పగలు రెక్కీ..

మొయినాబాద్ మండల కేంద్రంతోపాటు గ్రామాల్లోనూ వరుస చోరీలు జరుగుతున్నాయి. దుండగులు రాత్రి సమయాల్లో షాపులు, ఇళ్లు, దేవాలయాల్లో చోరీలకు తెగబడుతున్నారు. ఆరు నెలల క్రితం మొయినాబాద్ పెట్రోల్ బంక్ సమీపంలో రాత్రి పార్కు చేసిన కార్లు, ఇతర వాహనాల్లో బ్యాటరీలను ఎత్తుకెళ్లారు. మూడు నెలల క్రితం బాకారం గ్రామానికి చెందిన ఓ కుటుంబం ఇంటికి తాళం వేసి తీర్థయాత్రలకు వెళ్లడంతో పగలు రెక్కీ నిర్వహించిన దొంగలు రాత్రి ఇంట్లోకి చొరబడి ఐదు తులాల బంగారు, 120 తులాల వెండి ఆభరణాలు, రూ.3.50 లక్షల నగదు దోచుకెళ్లారు. మండల కేంద్రంలోని ఓ కళాశాల సెల్లార్‌లో నివాసముండే ఇంట్లోకి ఇద్దరు మహిళలు చొరబడి విలువైన పట్టుచీరలు, నగదు దోచుకెళ్లారు. రెండు నెలల క్రితం సురంగల్‌లోని కట్టమైసమ్మ ఆలయం వద్ద అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగుడు హుండీని పగులగొట్టి అందులో ఉన్న డబ్బులు ఎత్తుకెళ్లాడు. ఆ తరువాత రెండు రోజులకే మండల పరిధిలోని నాగిరెడ్డిగూడలోని హనుమాన్ ఆలయంలో హుండీని పగులగొట్టి డబ్బులు దోచుకెళ్లారు. వారం రోజుల క్రితం మండల కేంద్రంలోని ఓ స్టీల్, సిమెంటు షాపుల షటర్ తాళాలు పగులగొట్టి టీవీ, సెల్ ఫోన్ చోరీ చేశారు.

సీసీలోనూ చిక్కని ముఖాలు

చోరీ చేసే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఉన్నా దుండగులు జంకడం లేదు. ముఖానికి మాస్కులు వేసుకుని, సీసీ కెమెరాకు ముఖం చూపించకుండా జాగ్రత్త పడుతూ చోరీలకు తెగబడుతున్నారు. పోలీసులు చోరీ తర్వాత సీసీ కెమెరాలను పరిశీలించి దొంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ కేసుల్లో దొంగల ముఖాలు సీసీ కెమెరాల్లో సరిగా కనిపించకపోవడంతో వారిని పట్టుకోలేకపోతున్నారు.

నిఘా వైఫల్యమే కారణమా?

తరచూ దొంగతనాలు జరగడానికి పోలీసుల నిఘా వైఫల్యమే కారణమంటూ స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రి సమయాల్లో గస్తీ కాయాల్సిన పోలీసులు పార్టీలు జరిగే ఫాంహౌస్‌లకు వెళ్లి వసూళ్ల పనిలోనే ఉంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. చోరీల నివారణకు ఉన్నతాధికారులు సైతం సరైన చర్యలు తీసుకోవడం లేదని.. అందుకే దొంగలు రెచ్చిపోతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మొయినాబాద్ పోలీస్ స్టేషన్

నిఘా పెంచుతాం



మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనాల నివారణకు నిఘా పెంచుతున్నాం. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించే ప్రయత్నం చేస్తున్నాం. రాత్రి సమయాల్లో గస్తీని పెంచుతాం. ప్రజలు అప్రమత్తంగా ఉండి ఎవరైనా అనుమానితులు గ్రామాల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

భవనంపై నుంచి దూకి నవవధువు ఆత్మహత్య



దివ్య(ఫైల్)

ఉప్పల్: పెళ్లైన మూడునెలలకే ఓ నవవధువు ఆత్మహత్య చేసుకుంది. ఉప్పల్ పోలీసులు తెలిపిన ప్రకారం.. రామంతాపూర్ రామిరెడ్డినగర్ ప్రాంతానికి చెందిన పాక నవీన్‌కు, అంబర్‌పేట ప్రేమ్‌నగర్ ప్రాంతానికి చెందిన దివ్య(29)తో మూడు నెలల క్రితం వివాహమైంది. వివాహం అయిన నాటి నుంచి ముభావంగా ఉండే దివ్య ఈ నెల 27న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం మధ్యాహ్నం ఆమె రామిరెడ్డినగర్‌లో తిరిగుతూ చివరకు ఓ మూడంతస్తుల భవనం ఎక్కి అక్కడ నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. కేసు దర్యాప్తులో ఉంది.

‘థార్ గ్యాంగ్’ కదలికలున్నాయి..జాగ్రత్త

ఘట్‌కేసర్: థార్ గ్యాంగ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని క్రైం ఎస్ఐ అశోక్ అన్నారు. ఘట్‌కేసర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ నగరంలో థార్ గ్యాంగ్ కదలికలు కనిపించాయని పేర్కొన్నారు. రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులపై అనుమానం వస్తే వెంటనే ‘డయల్ 100’కు ఫోన్‌కాల్ చేయాలని సూచించారు. స్థానిక పోలీసులకుసమాచారం అందించాలని ఆయన కోరారు.

కిషన్‌పల్లిలో భూ తగదా

- అన్నదమ్ముల కుటుంబాల్లో పంచాయితీ
- పోలీసుల రంగ ప్రవేశం
- కోర్టు తీర్పు వచ్చే వరకు వేచి ఉండాలని సూచన
- లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిక

యాచారం: ఏళ్లుగా సాగుతున్న ఓ భూ వివాదం కేసు ఇరు వర్గాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. ఘర్షణ జరిగే సమయంలో అందులోని ఓ వ్యక్తి డయల్ 100కు ఫోన్ చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరు వర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. భూ వివాదం ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలి.. ఘర్షణలకు పాల్పడితే మాత్రం ఇరువురిపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని పోలీసులు హెచ్చరించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. మాల్ అనుబంధ గ్రామం కిషన్‌పల్లిలో పాల బజారు అనే వ్యక్తికి సోమయ్య, మల్లయ్య సంతానం. పాల బజారుకు 736, 738, 757, 758, 759 సర్వే నంబర్లలో 36.29 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇట్టి భూమిని 1999లో గ్రామస్తుల సమక్షంలో సోమయ్యకు 18.22 ఎకరాలు, మల్లయ్యకు 17.12 ఎకరాల భూమి పంపిణీ చేశారు. సోమయ్య భాగానికి వచ్చిన భూమిలో పెద్ద బండరాళ్లు ఉండి సాగుయోగ్యంగా లేకపోవడంతో అదనంగా 1.10 ఎకరాల భూమిని ఇచ్చారు. నాటి నుంచి ఇద్దరూ భూమిని సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. కొన్నేళ్ల తర్వాత సోమయ్య మనుమలు రాజు, మధుకర్ రాళ్లను తీసేసి చదును చేసినారు. ఈ భూమి కొత్తపల్లి గ్రామానికి వెళ్లే దారిలో రోడ్డు పక్కనే ఉండడం.. అధిక డిమాండ్ ఉంటుందనే మళ్లీ భూ పంపకం చేపట్టాలని మల్లయ్య మనుమలు శ్రీకాంత్, రజినికాంత్ పలుమార్లు సోమయ్య వారసుల భూమిలో ఆక్రమించి దున్నడం, వారితో ఘర్షణ పడుతున్నా రు. ఈ విషయంలో గతంలోనూ మల్లయ్య మనుమలపై కేసు నమోదయ్యాయి. మల్లయ్య కుమారు డు వెంకటయ్య రంగారెడ్డి జిల్లా కోర్టులో పార్టీషన్ గురించి సివిల్ కేసు వేశాడు. ప్రస్తుతం కేసు పెండింగ్‌లో ఉండగానే ఇరువర్గాల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈ విషయమై యాచారం సీఐ శంకర్‌కుమార్ ఇరువురిని పిలిచి భూ పంపిణి విషయమై కోర్టు పరిధిలో ఉన్న దృష్ట్యా తీర్పు వచ్చే వరకు ఎవరి భాగంలో వాళ్లే ఉండాలని, ఘర్షణ పడి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే ఇరువురిపై కేసులు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.

భారత జాతీయ మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంజుల



చేవెళ్ల: భారత జాతీయ మహిళా సమాఖ్య వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మంజుల ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి మాట్లాడుతూ.. ప్రజలు, మహిళల కోసం భారత జాతీయ మహిళా సమాఖ్య కృషి చేస్తోందన్నారు. పార్టీలో మహిళా నాయకురాలిగా వర్ల మంజుల సేవలను గుర్తించి ఆమెను ఏకగ్రీవంగా ఎంపిక చేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన మంజుల మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ నా యకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మహిళల సమస్యల పరిష్కారానికి పనిచేస్తూ వా రికి అండగా ఉంటానన్నారు. సీపీఐ పార్టీ నాయకులు ప్రభులింగం, సత్యనారాయణ, సత్తిరెడ్డి, మక్బుల్, శివయ్య, అంజయ్య, సుధాకర్‌గౌడ్ తదితరులు ఆమెకు అభినందనలు తెలిపారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య



బాధితుడిని పరామర్శిస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: దళిత యువకుడు చించేటి శివకుమార్‌పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గ్రామంలోని బాధితుడి ఇంటికి వచ్చి పరామర్శించారు. దాడికి సంబంధించిన కారణాలు తెలుసుకున్నుఆరు. అనంతరం దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దళితులను చిన్నచూపు చూస్తూ అంటరాని వారిగా పరిగణించడం సరికాదన్నారు. దళిత యువకుడు శివకుమార్‌పై బీసీ వర్గానికి చెందిన వారు దాడి చేసి కులం పేరుతో దూషించారని ఆరోపించారు. గ్రామంలో జరిగిన బోనాల ఉత్సవంలో దళితులు పాల్గొనడంతో ఓర్వలేక కొందురు కులవివక్షతో దాడికి పాల్పడ్డారని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేశ్, మహేశ్, వినోద్, నర్సింహ, మల్లేశ్, శేఖర్, శివ, రాఘవేంద్ర, రాజు, శ్రీకాంత్, అనిల్, శరత్, అంజి, చిన్నయ్య, శ్రీకాంత్, రాజేశఖ, శేఖర్, ప్రవీణ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇబ్రహీంపట్నం: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. రాయపోల్ గ్రామానికి చెందిన రాసుల సాయి(19) రాత్రి 11గంటల సమయంలో వ్యవసాయ పొలానికి వెళ్లేందుకు ఇబ్రహీంపట్నం మార్గంలో ప్రయాణిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలోని గంగాదేవి ఆలయం వద్ద రాగానే వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సాయి తలకు బలమైన గాయమవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన అదే గ్రామానికి చెందిన దొర్నాల రాజేశ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతుడు డిగ్రీ చదువుతున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ...

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి.. నలుగురికి గాయాలు

శామీర్‌పేట్: కుటుంబసభ్యులతో కలిసి దైవదర్శనం చేసుకొని తిరుగు పయనమయ్యారు. మరో గంటలో ఇంటికి చేరుకోనున్నారు. అంతలోనే రోడ్డు ప్రమాదానికి గురై ఇంటి యజమాని మృతి చెందాడు. జినోమ్ వ్యాలీ పోలీసులు, బాధిత కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... ఆర్‌సీ పురం ప్రాంతానికి చెందిన రాజేశ్వరరావు(64) తన కుటుంబసభ్యులతో కలిసి కారులో కొమురవెల్లి ఆలయానికి వెళ్లారు. సోమవారం ఉదయం కరీంనగర్–హైదరాబాద్ రాజీవ్ రహదారి గుండా తిరిగి వస్తుండగా తుర్కపల్లి చెక్‌పోస్ట్ సమీపంలో కారు అదుపు తప్పింది. రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజేశ్వరరావు మృతి చెందగా భార్య విజయలక్ష్మీ, కొడుకు ప్రవీణ్, కూతురు ప్రవళిక, అల్లుడు ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని సీఐ యాదయ్య తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

షాహి ఇమామ్ ఎండీ.ఉస్మాన్ లుథియాని



అవగాహన కల్పిస్తున్న ఉస్మాన్ లుథియాని

షాబాద్: యువత డ్రగ్స్‌కు, మాదకద్రవాల వినియో గంతో జీవితాలు నాశనమవుతున్నాయని పంజాబ్‌కు చెందిన షాహి ఇమామ్ మహమ్మద్ ఉస్మాన్ లుధియాని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆయన నగరంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వరల్డ్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషనర్ నేషనల్ ప్రెసిడెంట్ జాకీర్‌షరీఫ్‌తో కలిసి పాల్గొన్నా రు. ఈ సందర్భంగా షాహి ఇమామ్ మహమ్మద్ ఉస్మాన్ లుధియాని మాట్లాడుతూ.. విద్యార్థులు, యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూ చించారు. డ్రగ్స్ వినియోగంతో జరిగే దుష్ప్రభావాలను వివరించారు. మాదకద్రవ్యాలు అమ్మినా, కొనుగోలు చేసినా నేరమన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్ అంధకారమవుతుందన్నారు.

గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గృహ నిర్మాణాల క్రమబద్ధీకరణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చార్మినార్ జోన్‌లో రాజేంద్రనగర్ సర్కిల్‌ను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోనున్నట్లు సమాచారం అందుతోంది. ఇందుకోసం అధికారులు, రెవెన్యూ సిబ్బంది ముమ్మరంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు తమ వార్డుల వారీగా తగు ఏర్పాట్లు ప్రారంభించారు. అధికారులు ఆదేశించగానే ప్రతి ఇంటి సర్వేను చేపట్టనున్నారు. ప్రస్తుతం చెల్లిస్తున్న ఆస్తిపన్ను, భవన నిర్మాణాల అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తదితర వాటన్నింటిని పరిశీలించి నమోదు చేయనున్నారు. అనుమతులకు అదనంగా అంతస్తులు, నిర్మిస్తే వాటిని సైతం రికార్డు చేయనున్నట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ బయిలా ప్రకారం వీటికి సైతం ఆస్తిపన్నును జోడించనున్నట్లు తెలుస్తుంది. అదనపు అంతస్తులు నిర్మించిన వారు బీఆర్‌ఎస్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇందుకోసం అనేక మంది గతంలో దరఖాస్తులు చేసుకున్నారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీ అధికారులు ఈ సర్వే చేపడితే అందరికి లాభం చేకూరనుంది. ప్రభుత్వానికి సైతం అదనంగా ట్యాక్స్‌ల రూపంలో నగదు రానుంది.

వృద్ధుడికి సేవ చేసిన మొబైల్ పోలీసులు



వృద్ధుడికి బట్టలు వేస్తున్న కానిస్టేబుల్

మైలార్‌దేవ్‌పల్లి: రోడ్డుపై మతిస్థిమితం లేని వృద్ధుడికి పోలీసులు ఆహారం అందజేసి బట్టలను సరిజేసి మానవత్వం చాటుకున్నారు. డివిజన్ పరిధిలని మధుబన్ కాలనీ ప్రధాన రహదారిపై మతిస్థిమితం లేని, ఆహారం లేకుండా ఓ వృద్ధుడు రెండు రోజులుగా ఉన్నాడని సోమవారం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు మొబైల్ పోలీసులు వెంటనే వచ్చి అతని వివరాలు అడిగారు. అందుకు ఆ వృద్ధులు సరైన సమాధానం చెప్పకపోవడంతో, మతిస్థిమితం లేకుండా అనారోగ్యంగా ఉన్నాడని 108కు కాల్ చేసి వైద్యుడిని రప్పించారు. ఆకలితో ఉండవచ్చని స్థానికులతో కలిసి ఆహారం అందించడంతోపాటు అతని బట్టలు సరిగా లేకపోవడంతో రోడ్డు ప్రక్కన ఉన్న వారు బట్టలు తెచ్చి ఇచ్చారు. కానీ ఆ వృద్ధుడు లేవనేని పరిస్థితిలో ఉండడంతో, స్థానికుల సహాయంతో మొబైల్ పోలీసులు అతనికి బట్టలు వేశారు. వృద్ధుడి వివరాలు ఎవ్వరికైన తెలిసి ఉంటే పోలీస్ స్టేషన్‌కు తెలుపాలని కోరారు. పోలీసులు వృద్ధుడికి చేస్తున్న సేవకు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.